క్లుప్తంగా

బెట్టింగ్ యాప్‌లు నమ్మి మోసపోవద్దు

నందిగామటౌన్: ఈజీ మనీ మాయలో పడి విద్యార్థులు, యువత తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గోపీ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా బెట్టింగ్ యాప్‌లు పనిచేస్తున్నాయన్నారు. బెట్టింగ్ యాప్‌ల కారణంగా ఇప్పటికే ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు, ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రంజాన్ తోఫా పంపిణీ



పెండ్యాల(కంచికచర్ల):మండలంలోని పెండ్యాల గ్రామంలో జేఎం ఫౌండేషన్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో 350మంది పేద ముస్లింలకు బుధవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికీ ఎనిమిది కేజీల బియ్యం, నూనె, ఉల్లిపాయలు, గోధుమపిండి, పంచదార, కొబ్బరి, కర్జూరాలు, ఉప్పు, సేమియా పంపిణీ చేశారు. 150మంది పేద ముస్లిం మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఐదేళ్లుగా జేఎం ఫౌండేషన్ ద్వారా యూత్ కమిటీసభ్యులు రంజాన్‌తోఫా పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మత గురువు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

నందిగామటౌన్: నందిగామ బార్ అసోసియేషన్ ఎన్నికలను గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి టీవీఎం శర్మ, అసిస్టెంట్ ఎన్నికల అధికారి ప్రభాకరరావు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆయా పదవులకు జరిగే ఎన్నికల్లో అసోసియేషన్‌లోని మొత్తం 153మంది న్యాయవాదులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని వారు వివరించారు. ముఖ్యంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి బరిలో నిలిచిన నంద్రు బాబూ విద్యాసాగర్, పీవీ నరసింహారావు మధ్య తీవ్ర పోటీ నెలకొంది. 22ఏళ్ల తరువాత నందిగామ బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరుగుతుండటంతో బార్ అసోసియేషన్, కోర్టు ఆవరణలో బుధవారం నుంచే ఎన్నికల కోలాహలం నెలకొంది.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నందిగామటౌన్: ప్రధాని నరేంద్రమోడీ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడమే కాకుండా పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి నర్సింగ్‌రావు పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కమిటీ సభ్యులు ప్రజా సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అంతే కాకుండా రాష్ట్రాభివృద్ధికి, పోలవరం, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం విరివిగా నిధులు అందిస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాల రమేష్, తొర్లికొండ సీతారామయ్య, బండారు కేదార్‌నాథ్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, ఊటుకూరు సత్యనారాయణ, కొత్త సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



వీరులపాడు: రాష్ట్రంలో పాస్టర్లకు భద్రత లేకుండా పోయిందని పాస్టర్ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ మృతిపై కారకులైనవారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జుజ్జూరులో పాస్టర్లు బుధవారం నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ మృతి పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ వేగవంతం చేయాలన్నారు. క్రైస్తవులపై ఉద్దేశ్యపూర్వకంగా కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన ర్యాలీలో పాస్టర్‌లు గొర్రెపాటి ఇమ్మానియేలు, రాజు, ఆయా గ్రామాల పాస్టర్లు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

కంచికచర్ల : పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సీబీఐ విచారణ వేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్ కిరణ్ బుధవారం డిమాండ్ చేశారు. సనాతన ధర్మం అంటూ ఊగిపోతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ ఘటనపై వెంటనే స్పందించి తన వైఖరిని తెలియజేయాలని డిమాండ్‌చేశారు. మాయ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి రాష్ట్రంలో మత విద్వేషాలు పెరిగిపోతున్నాయని ఆయన విమర్శించారు.

నందిగామ ఎంపీపీ ఎన్నిక

లాంఛనప్రాయమే

- నేటి ఎంపీపీ ఎన్నికకు అధికారుల ఏర్పాట్లు
- వైఎస్సార్ సీపీ ఎంపీపీ అభ్యర్థిగా రమాదేవి
- ఎంపీటీసీల ఏకాభిప్రాయంతో ఎంపిక



పెసరమల్లి రమాదేవి, ఎంపీపీ అభ్యర్థి



నందిగామ మండల పరిషత్ కార్యాలయం

నందిగామరూరల్: నందిగామ మండల పరిషత్ అధ్యక్ష పదవికి గురువారం నిర్వహించనున్న ఎన్నిక లాంఛనప్రాయం కానుంది. గతంలో నందిగామ మండల పరిషత్ ఎన్నికకు సంబంధించి మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలకుగాను వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ 13స్థానాల్లో విజయం సాధించగా టీడీపీ ఒక్కస్థానంలో గెలుపొందింది. ఎంపీపీ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన కేతవీరునిపాడు ఎంపీటీసీ అరిగెల సుందరమ్మ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో కొంత కాలం కిందట ఆమె తన పదవికి రాజీనామా చేశారు. దీంతో అడవిరావులపాడు ఎంపీటీసీ సభ్యుడు ఆకుల హనుమంతరావు ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా ఎన్నికల సంఘం ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీచేయడంతో గురువారం ఎన్నిక జరగనుంది. ఇందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్‌సీపీకి 12 మంది ఎంపీటీసీలు

ఎంపీపీ ఎన్నికకు అవసరమైన పూర్తి మెజార్టీ వైఎస్సార్‌సీపీకి ఉండటంతో ఈ పదవి ఆపార్టీకే దక్కనుంది. వైఎస్సార్ సీపీ గెలుపొందిన 13మంది ఎంపీటీసీ సభ్యులలో ఐతవరం ఎంపీటీసీ సభ్యుడు అన్నం పిచ్చయ్య కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీలో చేరారు. ఎంపీటీసీల్లో ముగ్గురు మహిళలు ఎస్సీ రిజర్వుడు స్థానాల నుంచి కొనసాగుతున్నారు. ఓ ఎస్సీ మహిళ ఓపెన్ కేటగిరీ నుంచి కూడా గెలిచింది. కేతవీరునిపాడు ఎంపీటీసీ సెగ్మెంట్ నుంచి అరిగెల సుందరమ్మ, రుద్రవరం సెగ్మెంట్ నుంచి జిల్లేపల్లి కమల, రాఘవాపురం నుంచి పెసరమల్లి రమాదేవి ఎంపీటీసీలు కొనసాగుతుండగా, ఓసీ మహిళకు రిజర్వ్ అయిన దాములూరు స్థానంలో గెలుపొందిన ఎస్సీ మహిళ నల్లపు సునీత కూడా వైఎస్సార్‌సీపీకి చెందిన వారే. ఇలా ఎంపీపీ పదవికి అర్హులైన నలుగురు మహిళలు వైఎస్సార్ సీపీ తరఫునే ఎంపీటీసీలుగా ఉన్నారు. దీంతో ఎంపీటీసీ సభ్యుల ఏకాభిప్రాయం మేరకు శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కలిసి ఎంపీపీ అభ్యర్థిగా పెసరమల్లి రమాదేవిని ప్రకటించారు. మొత్తం 14మంది సభ్యులకుగాను వైఎస్సార్ సీపీకి 12మంది ఎంపీటీసీ సభ్యులు ఉండటంతో రమాదేవి ఎన్నిక లాంఛనప్రాయమేనని చెప్పవచ్చు.

కూటమికి అభ్యర్థి కరువు?..

తాజా రాజకీయ పరిణామాలు, వైఎస్సార్ సీపీ బలం రీత్యా ఎంపీపీ ఎన్నికలకు సంబంధించి కూటమి తరఫున పోటీచేసేందుకు అభ్యర్థి లేని పరిస్థితి నెలకొంది. ఎస్సీ రిజర్వుడు స్థానాలతోపాటు ఓసీ స్థానం నుంచి గెలిచిన నలుగురు ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీ వారే కావడంతో కూటమికి అభ్యర్థి లేకుండా పోయారు. సరిపడా సంఖ్యాబలం లేనప్పటికీ నందిగామ మండల పరిషత్ అధ్యక్ష పీఠాన్ని కై వసం చేసుకునేందుకు టీడీపీ నాయకులు మాత్రం విశ్వప్రయత్నాలు చేసినట్లు సమాచారం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎంపీటీసీ సభ్యులను మభ్యపెట్టి వారిని కూటమి వైపు తిప్పుకునేందుకు యత్నించిన ప్రయత్నాలు కూడా బెడిసికొట్టడంతో ఆచర్యలను టీడీపీ నాయకులు విరమించుకున్నట్లు రాజకీయవర్గాల్లో ప్రచారం సాగుతోంది. కూటమి నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా నందిగామ మండల పరిషత్ అధ్యక్ష పీఠాన్ని చేజారనీయకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోనుండటంతో ఆపార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

చేసిన పనులకు బిల్లులు ఇవ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్

కంచికచర్ల : వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా మండల పరిషత్ నిధులుతో బోరు పంపులు వేయించామని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మలక్‌బషీర్ మాట్లాడుతూ మండల పరిషత్ 15వ ఆర్థికసంఘ నిధులతో గండేపల్లిలో మూడు బోర్లు, గొట్టుముక్కలలో 3, మోగులూరు 1, కంచికచర్లలో ఒక బోరుపంపు వేయించినట్లు తెలిపారు. కంచికచర్ల 6వ సెగ్మెంట్‌లో పైపులైన్ కోసం రూ.2లక్షలు, బోరు పంపులకు మరమ్మతులకు రూ. 6లక్షలు కేటాయించి పనులు చేపట్టామని వివరించారు. ఎంపీటీసీ వేమా రోజారమణి మాట్లాడుతూ గ్రామ సచివాలయ భవనాలు నిర్మించినా నేటివరకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదన్నారు. అప్పులు తెచ్చి సచివాలయభవన నిర్మాణాలను పూర్తి చేసినప్పటికీ బిల్లులు మంజూరు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని మండిపడ్డారు. సీసీ రోడ్ల బిల్లులు ఎప్పుడు మంజూరు చేస్తారని అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు లాభాలో ఉందని కాని నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ మార్ట్‌ను మూసివేయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులతో ప్రజలు అనేక అవస్థలుపడుతుండగా, ప్రభుత్వం మాత్రం సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఎంపీటీసీ సభ్యులు బర్రె ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు ప్రవేటు వ్యక్తులకు చెందిన ఇళ్లలో ఉన్నాయని ఆభవనాలకు వేల సంఖ్యలో ప్రభుత్వం అద్దె చెల్లిస్తోందన్నారు. మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన కాంప్లెక్స్ మాత్రం ప్రైవేటు వ్యక్తులకు వందల రూపాయలకు మాత్రమే అద్దెకు ఇవ్వడం శోచనీయమన్నారు. అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో లాలూచీపడటమే ఇందుకు కారణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. తద్వారా ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోందన్నారు. ఏపీఓ రమాదేవి మాట్లాడుతూ భూగర్భజలాలు అడుగంటకుండా ప్రతిఒక్కరూ ఇంకుడు గుంటలు తీసుకోవాలని, ఇందుకయ్యే ఖర్చును చెల్లిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.3.3కోట్ల నిధులు మంజూరు చేసిందని ఆ నిధులతో ప్రతి ఒక్కరికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ బి.శ్రీనివాసరావు, సర్పంచి వేల్పుల సునీత, ఇన్‌చార్జి తహసీల్దార్ వి.మానస, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజ్‌లో ఆరని మంటలు



కోల్డ్‌స్టోరేజీలో మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్న ఫైర్ సిబ్బంది



సీఐ వెంకటేశ్వర్లును కలిసి న్యాయం చేయాలని కోరుతున్న బాధిత రైతులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలో అగ్ని ప్రమాదానికి గురైన సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజ్‌లో మంటలు రెండో రోజు బుధవారానికి కూడా అదుపులోకి రాలేదు. ఏ, బీ చాంబర్లుగా ఉన్న కోల్డ్‌స్టోరేజ్ భవనంలో ఏ ఛాంబర్‌లో మిర్చి బస్తాలు, అపరాలు నిల్వ ఉంచారు. బి ఛాంబర్ ఖాళీగానే ఉండటంతో నిప్పు అంటుకోలేదు. ఏ చాంబర్‌లో సుమారు 400మందికి పైగా రైతులకు చెందిన 35వేల నుంచి 40వేల మిర్చి బస్తాలను నిల్వ ఉంచగా, ఈచాంబర్ పూర్తిగా దగ్ధమై ముప్పావు శాతం కూలిపోయింది. అయినప్పటికీ మంటలు ఏమాత్రం ఆగడంలేదు. మొత్తం 9 ఫైర్ ఇంజిన్లతో సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. ఓ వైపు మంటలార్పడం, మరోవైపు శిథిలాల తొలగింపు కార్యక్రమాలు సాగుతున్నాయని జిల్లా ఫైర్ ఆఫీసర్ ఏవీ. శంకరరావు తెలిపారు. మంటలు అదుపులోకి రావడానికి మరోరోజు పడుతుందని ఆయన వివరించారు. ఈ ప్రమాదంలో రూ.15కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇన్స్యూరెన్స్ గడువు గత ఫిబ్రవరి 19వ తేదీతో ముగిసినప్పటికీ ఇన్స్యూరెన్స్‌ను రెన్యువల్ అంశాన్ని కోల్డ్‌సోరేజీ పట్టించుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం ఇటీవల ఓ బ్యాంకు నుంచి రూ 12 కోట్ల రుణం తీసుకున్నారని అధికారులు చెబుతుండటం గమనార్హం.

మేనేజింగ్ పార్టనర్‌పై కేసు నమోదు..

కోల్డ్‌స్టోరేజ్ మేనేజింగ్ పార్టనర్లుగా రావూరి శ్రీనివాసరావు, హరినరసింహారావు, నారాయణరెడ్డి, యలమంచిలి రాఘవ ఉండగా, తహసీల్దార్ ఫిర్యాదు మేరకు రావూరి శ్రీనివాసరావుపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. 35వేల మిర్చి బస్తాలు, కొన్ని అపరాల బస్తాలు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉన్నాయని, వాటి విలువ రూ.10కోట్ల విలువ ఉంటుందని తహశీల్దార్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కోల్డ్‌స్టోరేజీ యజమాని రావూరి శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భీమవరం రైతుల మిర్చినే అధికం..

ఈ కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసిన మిర్చి బస్తాలలో వత్సవాయి మండలం, భీమవరం గ్రామానికి చెందిన రైతుల మిర్చినే 50శాతం ఉందని బాధిత రైతులు చెబుతున్నారు. మిర్చికి సరైన మద్దతు ధర లేకపోవడంతో భవిష్యత్‌లో ధర ఏమైనా పెరుగుతుందనే ఆశతో నిల్వ చేసుకున్నామని, తీరా అగ్నిప్రమాదం కారణంగా తీవ్రంగా నష్టపోయామంటూ బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బాధిత రైతులు బుధవారం జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లును కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో కోలుకోలేమని వాపోయారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని రైతులు పేర్కొన్నారు. బాధిత రైతుల ఆవేదన వారి మాటల్లోనే...

అప్పుల పాలయ్యాను..



నేను తొమ్మిది ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేశాను. పెట్టుబడి రూ.22 లక్షలు కాగా, అందులో రూ.18లక్షలు అప్పులు చేశాను. మిర్చికి గిట్టుబాటు ధర లేకపోవడంతో నెలరోజులుగా 500 బస్తాలను కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచగా అగ్ని ప్రమాదంలో మిర్చి అంతా దగ్ధమైంది. ఇప్పుడు నేను అప్పులు ఎలా తీర్చాలి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

షేక్ నాగుల్ హుస్సేన్,
బాధిత రైతు, భీమవరం

రూ.63 లక్షలు నష్టం..



25ఎకరాల్లో మిర్చి పంట వేశాను. పండిన పంటలో కోల్డ్ స్టోరేజ్‌లో నేను 1218 మిర్చి బస్తాలు(550 క్వింటాలు) నిల్వ ఉంచాను. వాటి విలువ సుమారు రూ 63 లక్షలు ఉంటుంది. మార్కెట్‌లో మద్దతు ధర లేకపోవడంతో రానున్న రోజుల్లో ధర పెరుగుతుందేమో అని ఆశతో ఇక్కడ నిల్వ ఉంచాను. ఇప్పుడిలా జరిగింది. తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

షేక్ బహబూబ్ హుస్సేన్, భీమవరం.

పాలవ్యాన్ ఢీకొని యువకుడు మృతి



పెనుగంచిప్రోలు : ద్విచక్ర వాహనదారుడిని పాలవ్యాన్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి పెనుగంచిప్రోలు మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన పలగాని పుల్లారావు(19) బైక్‌పై పెనుగంచిప్రోలు నుంచి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న పాలవ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో పుల్లారావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్లకు పదోన్నతులు కల్పించాలి : పీఆర్టీయూ

నందిగామ రూరల్: విద్యాశాఖను తీవ్రంగా నష్టపరుస్తున్న జీవోనంబరు 117ను ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం మెమో 13021ను విడుదల చేయడంపై పీఆర్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్‌జానీ, సోలా రాఘవరాజు బుధవారం హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు పనిభారం పెరగడంతో విద్యావ్యవస్థ తిరోగమనం వైపు వెళ్లిందన్నారు. దీనిని సరిదిద్దాలన్న ఉపాధ్యాయుల డిమాండ్ మేరకు ప్రభుత్వం మెమో జారీ చేసిందని తెలిపారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి డీఎస్సీ ద్వారా నూతన ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని కోరారు. హర్షం వ్యక్తంచేసిన వారిలో నాయకులు కోసూరి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పదిమంది కూలీలకు గాయాలు

నందిగామరూరల్: మిర్చి కోతలకు మహిళా కూలీలతో వెళ్తున్న ఆటో పల్టీ కొట్టిన ఘటనలో 10మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు కంచికచర్ల గ్రామానికి చెందిన 12మంది మహిళా కూలీలు ఆటోలో పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామానికి మిర్చి కోతలకు బయలుదేరారు. ఈక్రమంలో ఆటో కొణతమాత్మకూరు గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ఒక్కసారిగా టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో పదిమంది కూలీలు గాయపడటంతో వారిని పరిసర ప్రాంత ప్రజలు హుటాహుటిన నందిగామ, కంచికచర్ల ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. మెరుగైన వైద్య నిమిత్తం ఒకరిని విజయవాడ తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిమన్యు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామటౌన్: ప్రజాసమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయాశాఖల ప్రభుత్వాధికారులతో కలిసి బుధవారం ఆమె ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో తాగు, సాగునీటి సమస్యలపై ప్రజలు అర్జీలు అందించారని వాటిని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వచ్చే నెలలో కొత్త రేషన్‌కార్డులు, పింఛన్‌లను ప్రభుత్వం అందించనుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 82మంది గైర్హాజరు

నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో జరుగుతున్న పదోతరగతి పరీక్షలలో భాగంగా బుధవారం భౌతికశాస్త్రం పరీక్షను నిర్వహించారు. ఈపరీక్షకు డివిజన్ పరిధిలోని 40 పరీక్షా కేంద్రాలలో 6,121మంది విద్యార్థులకుగాను 6,039మంది హాజరయ్యా హాజరవగా 82మంది గైర్హాజరైనట్లు ఇన్‌చార్జ్ డీవైఈవో సాంబశివరావు తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని 25 పరీక్షా కేంద్రాల పరిధిలో 3,565మందికిగాను 3,507మంది పరీక్షకు హాజరవగా 58మంది గైర్హాజరయ్యారు. నందిగామ మండలంలోని 11 పరీక్షా కేంద్రాల పరిధిలో 1,481మందికిగాను 1,469మంది హాజరుకాగా 12మంది గైర్హాజరయ్యారు. కంచికచర్ల మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల పరిధిలో 934మందికిగాను 919మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు. చందర్లపాడు మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల పరిధిలో 704 మందికి గాను 693 మంది హాజరయ్యారు. 11మంది గైర్హజరయ్యారు. వీరులపాడు మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల పరిధిలో 446మంది విద్యార్థులకుగాను 426 మంది పరీక్షకు హాజరుకాగా, 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో..

జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 15 పరీక్షా కేంద్రాల పరిధిలో 2,556 మంది విద్యార్థులకు గాను 2,532మంది హాజరుకాగా 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జగ్గయ్యపేట మండలంలో ఏర్పాటు చేసిన 10పరీక్షా కేంద్రాల పరిధిలో 1,692మంది విద్యార్థులకుగాను 1,678మంది హాజరుకాగా 14మంది గైర్హాజరయ్యారు. పెనుగంచిప్రోలు మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల పరిధిలో 464మందికి గాను 458 మంది హాజరవగా ఆరుగురు, వత్సవాయి మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 400 మందికి గాను 396మంది హాజరవగా నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు : డ్వామా పీడీ



ప్రజావేదికలో పాల్గొన్న పీడీ రాము ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ శ్రీను తదితరులు

పెనుగంచిప్రోలు: ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎ.రాము హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 2023-24లో రూ.15కోట్లతో చేపట్టిన 1800 పనులపై ప్రజావేదికలో చర్చించారు. ఈసందర్భంగా పనుల్లో అవకతవకలు, సిబ్బంది రికార్డుల నిర్వహణ లోపం సామాజిక తనిఖీ ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో చదివి వినిపించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు సక్రమంగా వేయకపోవడం, ఒకే ఇంటిలో రెండు జాబ్‌కార్డులు ఇవ్వడం, కూలీలు సంతకాలు, వేలి ముద్రలు లేకుండానే నగదు ఇచ్చారని సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. అనిగండ్లపాడులో పనిచేయని కూలీలకు పనిచేసినట్లు హాజరు వేసి వేతనాలు ఇచ్చినట్లు గుర్తించారు. పంటకాలువల్లో కొలతలు భారీగా తేడా ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈసందర్భంగా పీడీ రాము మాట్లాడుతూ అనిగండ్లపాడు ఫీల్డ్‌అసిస్టెంట్ రమణను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారి నుంచి ఆ మేరకు నగదును రికవరీ వేస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజీ, ఎంపీడీఓ జి.శ్రీను, ఎంపీపీ మార్కపూడి గాంధీ, ఏపీఓ తిరుపతయ్య, సచివాలయ, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగ్గయ్యపేట రానున్న హోంమంత్రి

జగ్గయ్యపేట అర్బన్: నేరాల నియంత్రణకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం స్థానిక బి కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, ఎంపీ కేశినేని శివనాథ్, పేట, నందిగామ ఎమ్యెల్యేలు శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), తంగిరాల సౌమ్య, కలెక్టర్ లక్ష్మీశ హాజరుకానున్నట్లు వివరించారు. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వీటిని మంత్రులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన

వీరులపాడు: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరు తమవంతుగా సహకరించాలని ఇన్‌చార్జి సీడీపీఓ కృష్ణకుమారి పేర్కొన్నారు. వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భేటీ బచావో..భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా చిన్న వయస్సులోనే మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం అవగాహన కలిగించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలికలకు యుక్తవయస్సు వచ్చిన తరువాతనే వివాహాలు చేయాలన్నారు. బాల్యవివాహాలతో అనేక అనర్థాలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను తల్లిదండ్రులు ఉన్నత ఆశయాలతో పెంచడంతోపాటు బాగా చదివించాలని సూచించారు. లింగవివక్షకు తావు లేకుండా బాలురతో సమానంగా బాలికలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభావతి, ఎల్‌పివో కిరణ్‌కుమార్, జీవనకుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ



ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ భాగ్యలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సేవలను సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకు సాధించాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఎస్ఎఫ్ఐ నేతలతో కలిసి ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిష్ణాతులైన అధ్యాపకులచే పాలిటెక్నిక్ పరీక్షపై శిక్షణ ఇస్తామన్నారు. దాతల సహకారంతో ఉచితంగా స్టడీ మెటీరియల్స్ కుడా అందిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, కుమార్‌స్వామి, నాయకులు పాల్గొన్నారు.